



పిచ్చిమొక్కలతో ఉన్న తహసీల్దార్, ఐకేపీ కార్యాలయాలు

ఇవి మండల కార్యాలయాలా?

తోటపల్లిగూడూరు: స్వర్ణాంధ్ర – స్వచ్ఛాంధ్ర అంటూ కూటమి ప్రభుత్వం ఊదరగొడుతోంది. కానీ సాక్షాత్తు ప్రభుత్వ కార్యాలయాలే అధ్వానంగా ఉన్నా పట్టించుకున్న నాథుడే లేడు. మండల కేంద్రంలోని పలు ప్రభుత్వ కార్యాలయాలు పిచ్చిమొక్కలు, చెత్తాచెదారాలతో అడవిని తలపిస్తున్నా అధికారులు తమకేం పట్టనట్లు వ్యవహరిస్తున్నారు. ప్రతినెలా మూడో శనివారం గ్రామాల్లో పారిశుధ్య కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. అయితే కార్యాలయాలను చూస్తే స్వర్ణాంధ్ర – స్వచ్ఛాంధ్రను ఎంత చిత్తశుద్ధితో జరుపుతున్నారో ఇట్టే అర్థమవుతుంది. మండల వ్యాప్తంగా శుభ్రత, పరిశుభ్రత అంటూ తిరుగుతున్న అధికారులు ఎంపీడీఓ, తహసీల్దార్, ఐకేపీ, గృహ నిర్మాణ శాఖ కార్యాలయాలు పిచ్చిమొక్కలతో ఉన్నా పట్టించుకోవడం లేదు. రోజూ అటుగా వెళ్తున్నా పారిశుధ్య కార్యక్రమాలను మాత్రం చేపట్టడం లేదు.

ప్రమాదాలకు కేరాఫ్‌గా మలుపులు

తోటపల్లిగూడూరు: మండలంలోని ఆర్‌అండ్‌బీ రహదారిలో ఉన్న పలు మలుపులు ప్రమాదాలకు కేరాఫ్‌గా మారాయి. ముఖ్యంగా తోటపల్లిగూడూరు – సాలిపేట రోడ్డులో మాచర్లవారిపాళెం, మల్లికార్జునపురం, వరకవిపూడి ప్రాంతాల్లో ఉన్న మలుపులు ప్రమాదకరంగా ఉన్నాయి. కోడూరు – సాలిపేట మార్గంలోనూ ఇదే పరిస్థితి ఉంది. స్పీడ్‌బ్రేకర్లు, హెచ్చరిక బోర్డులు లేవు. వాహనాలు దగ్గరకు వచ్చేంత వరకు కనిపించవు. ఈ క్రమంలో ఆయా మార్గాల్లో తరచూ ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. గడిచిన ఏడాది కాలంగా ఆయా మార్గాల్లో అనేక ప్రమాదాలు జరిగినా ఆర్‌అండ్‌బీ అధికారులు ఎలాంటి రక్షణ చర్యలు చేపట్టలేదు. ఇప్పటికైనా స్పందించి స్పీడ్‌బ్రేకర్లు, హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు.



మల్లికార్జునపురం సమీపంలో..



మాచర్లవారిపాళెం సమీపంలో ఇలా..

క్లుప్తంగా

నిబంధనలు పాటించాలి



మాట్లాడుతున్న ఎస్సై శివరాకేష్

మనుబోలు: గ్రామాల్లోని వివిధ కూడళ్లలో వినాయక విగ్రహాలు ఏర్పాటు చేసేవారు నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని ఎస్సై శివరాకేష్ తెలిపారు. శుక్రవారం ఆయన పోలీస్‌స్టేషన్‌లో విలేకరులతో మాట్లాడారు. వెబ్‌సైట్ నుంచి అనుమతి పొందేందుకు ఎలాంటి రుసుము చెల్లించాల్సిన అవసరం లేదన్నారు.

వృద్ధులకు ఇంటి వద్దే సరుకుల పంపిణీ



డీలర్లతో మాట్లాడుతున్న తహసీల్దార్

మనుబోలు: 65 సంవత్సరాల వయసు పైబడిన వారికి డీలర్లు ఇళ్ల వద్దే రేషన్ సరుకులు పంపిణీ చేయాలని తహసీల్దార్ రమాదేవి ఆదేశించారు. శుక్రవారం ఆమె తన కార్యాలయంలో డీలర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వృద్ధులకు ప్రతి నెలా 26 నుంచి 31వ తేదీ వరకూ తప్పనిసరిగా సరుకులు అందించాలన్నారు. తూకాల్లో తేడా రాకుండా చూడాలన్నారు. సమావేశంలో డీటీ ప్రదీప్‌కుమార్, సివిల్ సప్లెస్ డీటీ రవి తదితరులు పాల్గొన్నారు.

టీబీ నివారణకు సహకరించాలి



ప్రైవేటు ఆస్పత్రుల డాక్టర్లతో మాట్లాడుతున్న డాక్టర్ ఖాదర్‌వలీ

నెల్లూరు(అర్బన్): టీబీ జబ్బును నివారించేందుకు ప్రైవేటు ఆస్పత్రుల వైద్యులు సహకరించాలని జిల్లా లెప్రసీ, ఎయిడ్స్, టీబీ నియంత్రణాధికారి డాక్టర్ ఖాదర్‌వలీ సూచించారు. టీబీ నివారణ కార్యక్రమంలో భాగంగా ఆయన నగరంలోని వైష్ణవి హాస్పిటల్, సాయి పథం హాస్పిటల్, మధుసూదన్‌శాస్త్రి ఆస్పత్రులను శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయా డాక్టర్లతో మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం టీబీ ముక్తభారత్ కోసం ప్రణాళిక చేపట్టిందన్నారు. అందువల్ల ప్రైవేటు ఆస్పత్రులకు వచ్చే రోగుల్లో ఎవరికైనా టీబీ లక్షణాలు కనిపిస్తే తక్షణమే ప్రభుత్వ వైద్యశాలకు రెఫర్ చేయాలని కోరారు. టీబీ రోగులకు పౌష్టికాహారం కోసం ప్రభుత్వం రూ.6 వేలను వారి ఖాతాల్లో జమ చేస్తుందన్నారు. అలాగే నాణ్యమైన మందులు అందిస్తోందన్నారు. అందువల్ల ప్రైవేటు వైద్యులు కూడా భాగం కావాలని కోరారు. కార్యక్రమంలో పబ్లిక్ ప్రైవేట్ మిక్స్ కో–ఆర్డినేటర్ హరీష్, భవ్య కో–ఆర్డినేటర్ తులసీరామ్, ఫీల్డ్ కో–ఆర్డినేటర్లు సరిత, అనూరాధ పాల్గొన్నారు.

ఆక్వా రంగ అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి

నెల్లూరు(పొగతోట): ఆక్వా రంగం అభివృద్ధిపై కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని కృషి విజ్ఞాన కేంద్రం సమన్వయకర్త డాక్టర్ జి.లలితా శివజ్యోతి అన్నారు. నగరంలోని కృషి విజ్ఞాన కేంద్రంలో కార్ప్ చేపల పెంపకంలో మేలైన యాజమాన్య పద్ధతులపై రైతులకు నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో శుక్రవారం ఆమె పాల్గొని, మాట్లాడారు. ఆక్వా రంగంలో కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ప్రధాన మంత్రి మత్స్య సంపద యోజన ఆక్వా రంగం అభివృద్ధికి దోహదపడుతుందన్నారు. కార్యక్రమంలో మత్స్య విభాగం శాస్త్రవేత్త శ్రీహరిప్రసాద్, డాక్టర్ ఎస్.లోకేష్‌బాబు పాల్గొన్నారు.

కొత్త కార్డుదారులకూ రేషన్ సరుకులు



మాట్లాడుతున్న తహసీల్దార్ స్ఫూర్తి రెడ్డి

కొడవలూరు: వచ్చే నెలలో కొత్త రేషన్‌కార్డులు వస్తున్నందున వారికీ సరుకులు అందించాలని తహసీల్దార్ కె.స్ఫూర్తిరెడ్డి సూచించారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో చౌక డిపో డీలర్లతో శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి డీలరు నిర్దేశించిన వేళల్లో చౌక డిపోల్లో అందుబాటులో ఉండాలన్నారు. అదేవిధంగా వృద్ధులు, ప్రత్యేకావసరాల వారికి ఇంటికే సరుకులను ఇవ్వాలన్నారు. ఈ విషయంలో కార్డుదారుల నుంచి ఫిర్యాదుల రాకుండా చూసుకోవాలని చెప్పారు. తూకాల విషయంలో పారదర్శకంగా ఉండాలన్నారు. తాను తరచూ తనిఖీలు నిర్వహిస్తానని, అవకతవకలు బయటపడితే చర్యలు తప్పవని హెచ్చరించారు. సమావేశంలో డీటీ సారంగపాణి, సీఎస్ డీటీ బాలకోటమ్మ, ఆర్‌ఐ హైమావతి పాల్గొన్నారు.

ఆలయాల్లో ప్రత్యేక పూజలు



మనుబోలు: ప్రత్యేకాలంకరణలో అమ్మవారు

పొదలకూరు: శ్రావణ మాసం చివరి శుక్రవారం సందర్భంగా అమ్మవారి ఆలయాల్లో మహిళలు ప్రత్యేక పూజలను నిర్వహించారు. పట్టణంలోని కన్యకాపరమేశ్వరి దేవస్థానంలో ప్రత్యేక పూజలను ఏర్పాటు చేశారు. శ్రీలక్ష్మి గోదా సమేత వెంకటేశ్వరస్వామి దేవస్థానంలో అమ్మవారికి పంచామృతాభిషేకం, సహస్రనామాలతో కుంకుమార్చన జరిపారు. అమ్మవారిని అలంకరించిన 60 వేల గాజులను మహిళా భక్తులకు అందజేశారు. తోడేరు పంచాయతీ పార్వతమ్మ దేవస్థానంలో పూజలు జరిగాయి.

➡ **మనుబోలు:** మండల కేంద్రంలోని విష్ణాలయంలో శ్రావణమాస పూజలను ఘనంగా నిర్వహించారు. శ్రీదేవి, భూదేవి సమేత విష్ణుమూర్తికి అభిషేకాలు, ప్రత్యేక పూజలు చేశారు. మహిళా భక్తులు పెద్ద సంఖ్యలో విచ్చేశారు.

శాస్త్రోక్తంగా సామూహిక కుంకుమార్చన



సామూహిక కుంకుమార్చనలో మహిళలు


బుచ్చిరెడ్డిపాళెం రూరల్: మండలంలోని జొన్నవాడలో కొలువైన మల్లికార్జున సమేత కామాక్షితాయి ఆలయంలో ఆఖరి శ్రావణ శుక్రవారం సందర్భంగా సామూహిక కుంకుమార్చన శాస్త్రోక్తంగా జరిగింది. ఉదయం అమ్మవారికి నవావరణ పూజ, ఖడ్గమాల, సహస్ర నామార్చన, సామూహిక లక్ష కుంకుమార్చన, పంచామృతాభిషేకం, నిత్య కల్యాణాన్ని ఆలయ పండితులు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు.

సాయంత్రం స్వామి, అమ్మవారిని పల్లకిపై ఊరేగించారు.

ఆకట్టుకున్న ప్రదర్శన

ఆలయంలో ప్రసిద్ధ కళాకారులు పద్మ, హేమలక్ష్మి, నాగలక్ష్మి వీణ వాయిద్యంతో భక్తులను ఆకట్టుకున్నారు. భక్తి గీతాలు, శాస్త్రీయ రాగాల సమ్మేళనంతో దేవాలయ ప్రాంగణం మార్మోగింది. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని, తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఏర్పాట్లను ఈఓ శ్రీనివాసులురెడ్డి పర్యవేక్షించారు.

పుష్పాలంకరణలో అమ్మవారు



ఇందుకూరుపేట: శ్రావణ శుక్రవారాన్ని పురస్కరించుకుని గంగపట్నంలోని చాముండేశ్వరి దేవస్థానంలో అమ్మవారికి తామర పుష్పాలంకరణ చేశారు. తొలుత అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి వివిధ పుష్పాలతో ప్రత్యేకాలంకరణ గావించారు. అధిక సంఖ్యలో భక్తులు విచ్చేసి అమ్మవారిని దర్శించుకున్నారు. పుష్పాలంకరణకు నెల్లూరుకు చెందిన కందిమల్ల రాజా సుధీర్‌కుమార్, లక్ష్మీ సరస్వతి, కుమార్తె లక్ష్మీ ధృవిక వ్యవహరించారు. అర్చకులు అనిల్‌స్వామి, రామకృష్ణస్వామి, కిశోర్‌స్వామి ఆధ్వర్యంలో వేడుకలు జరిగాయి. మధ్యాహ్నం అన్నప్రసాద వితరణ జరిగింది. ఈ కార్యక్రమానికి ఉభయదాతలుగా గుడిమెట్ల వెంకటరామిరెడ్డి, మహేశ్వరి దంపతుల కుమార్తె, అల్లుడు రాజ్యలక్ష్మి, పెంచల్‌రెడ్డి వ్యవహరించారు. ఆలయ కార్యనిర్వాహణాధికారి తాతా శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన అవసరం



ఆర్థిక అక్షరాస్యత కరపత్రాలను ప్రదర్శిస్తున్న వక్తలు

కొడవలూరు: ఆర్థిక అక్షరాస్యత పట్ల విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలని హెచ్‌ఎం సత్యనారాయణ సూచించారు. సొసైటీ ఫర్ సోషల్ ట్రాన్స్‌ఫర్మేషన్ ఆధ్వర్యంలో రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా డిపాజిటర్ ఎడ్యుకేషన్, అవేర్నెస్‌పై కొడవలూరు హైస్కూల్‌లో శుక్రవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్థిక క్రమశిక్షణ వల్ల భవిష్యత్తులో ఎంతో ఉపయోగముందన్నారు. మహిళా పోలీస్ లక్ష్మి మాట్లాడుతూ సైబర్ నేరాల పట్ల ప్రతి విద్యార్థి అవగాహన కలిగి ఉండాలన్నారు. వ్యక్తిగత సమాచారాన్ని గోప్యంగా ఉంచుకోవాలని సూచించారు. ఆ సంస్థ పీడీ, పీఎంలు వి.ఆంజనేయులు, వి.అశోక్‌కుమార్ మాట్లాడుతూ కేవైసీ పిన్ నంబర్లు, ఓటీపీలను ఎవరికీ తెలియజేయకుండా ఉంచాలన్నారు. బ్యాంక్‌లు అందించే బీమా పథకాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. పీఎంఎస్‌బీవై, పీఎంజేజేబీవై బీమా పథకాల్లో తల్లిదండ్రులను తప్పక నమోదు చేయించాలని సూచించారు. కార్యక్రమంలో ఏపీఎం కృష్ణవేణి, రిసోర్స్ పర్సన్‌లు అశోక్, సతీష్, ట్రైనర్‌లు నారాయణ, నాయక్‌బాషా పాల్గొన్నారు.

‘స్వర్ణాంధ్ర - స్వచ్ఛాంధ్ర’పై ర్యాలీ నేడు

బుచ్చిరెడ్డిపాళెం రూరల్: నగర పంచాయతీ పరిధిలో స్వర్ణాంధ్ర – స్వచ్ఛాంధ్ర కార్యక్రమం శనివారం జరుగుతుందని కమిషనర్ బాలకృష్ణ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇందులో భాగంగా కొత్తగా నిర్మిస్తున్న కూరగాయల మార్కెట్ నుంచి రెయిన్‌బో పాఠశాల వీధి వరకు ర్యాలీ నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో స్థానిక ప్రజలు, విద్యావంతులు, ప్రజాప్రతినిధులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

నేడు, రేపు ఆటల పోటీలు

బుచ్చిరెడ్డిపాళెం రూరల్: నగర పంచాయతీ పరిధిలోని డీఎల్‌ఎన్నార్ పాఠశాలలో శనివారం, ఆదివారం ఆటల పోటీలు నిర్వహిస్తామని ఇషా ఫౌండేషన్ సభ్యులు తెలిపారు. వారు శుక్రవారం పాఠశాలలో విలేకరుల సమావేశం నిర్వహించారు. 14 ఏళ్లు నిండిన వారు ఆటల పోటీల్లో పాల్గొనవచ్చన్నారు. వాలీబాల్, త్రోబాల్ తదితర ఆటలు నిర్వహిస్తామని పేర్కొన్నారు. రిజిస్ట్రేషన్‌కు సంబంధించి 76618 08710 నంబర్‌కు ఫోన్ చేయాలని సూచించారు.

నేడు గొలగమూడికి పూజిత రాక

వెంకటాచలం: మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి కుమార్తె, వైఎస్సార్‌సీపీ మహిళా విభాగం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కాకాణి పూజిత శనివారం గొలగమూడికి రానున్నట్లు ఆ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు మందల వెంకటశేషయ్య శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. సాయంత్రం 3 గంటలకు గొలగమూడికి చేరుకుని భగవాన్ శ్రీవెంకయ్యస్వామిని దర్శించుకుంటారన్నారు. వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొనాలని కోరారు.

రైతులకు అండగా నిలవాలి

కొడవలూరు: సహకార సంఘాలకు కొత్తగా ఎంపికైన పాలకవర్గాలు రైతులకు అండగా నిలవాలని ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి సూచించారు. నార్తురాజుపాళెంలోని స్వాగత్ కల్యాణ మండపంలో నూతనంగా ఎంపికైన సహకార సంఘాల పాలకవర్గాలు శుక్రవారం రాత్రి ప్రమాణ స్వీకారం చేశారు. తలమంచి సొసైటీ అధ్యక్షుడిగా పిట్టి సూర్యనారాయణ, గుండాలమ్మపాళెం సొసైటీ అధ్యక్షుడిగా బద్వేలు వినీల్‌రెడ్డి, యల్లాయపాళెం సొసైటీ అధ్యక్షుడిగా ఏకొల్లు వంశీరెడ్డి ప్రమాణస్వీకారం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రైతుల అవసరాలను దృష్టిలో పెట్టుకొని సకాలంలో ఎరువులను అందించడంతో పాటు పంట రుణాలందించి వెన్నుదన్నుగా నిలవాలన్నారు. టీడీపీ నాయకులు జీవీఎన్.శేఖర్‌రెడ్డి, ఎం.శ్రీహరిరెడ్డి, నాపా వెంకటేశ్వర్లునాయుడు పాల్గొన్నారు.

సహకార సంఘాల ప్రమాణ స్వీకారం

కోవూరు: మండలంలోని పడుగుపాడు సొసైటీ కార్యాలయ ఆవరణలో ముదివర్తి, పడుగుపాడు ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల ప్రమాణ స్వీకార కార్యక్రమం శుక్రవారం జరిగింది. ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి హాజరై, పలు సూచనలు చేశారు. సహకార సంఘాల సభ్యులు రైతులకు అండగా నిలవాలని కోరారు. కార్యక్రమంలో తహసీల్దార్ సుబ్బయ్య, టీడీపీ నేతలు జెట్టి రాజగోపాల్‌రెడ్డి, చేజర్ల వెంకటేశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు.

29 నుంచి తెలుగు భాషోత్సవాలు

నెల్లూరు రూరల్: నగరంలోని పుర మందిరం ప్రాంగణంలో ఈనెల 29, 30, 31వ తేదీల్లో మూడురోజులపాటు తెలుగు భాషోత్సవాలను ఘనంగా నిర్వహిస్తామని తెలుగు భాషా సాహితి, సాంస్కృతిక సేవా సంస్థ అధ్యక్షుడు కంచర్ల సుబ్బానాయుడు తెలిపారు. స్థానిక ప్రెస్‌క్లబ్‌లో శుక్రవారం ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. ఉభయ తెలుగు రాష్ట్రాలతోపాటు ఇతర ప్రాంతాల నుంచి దాదాపు 300 మంది సాహితీవేత్తలు, రచయితలు, కవులు పాల్గొంటారన్నారు. తెలుగు వ్యవహారిక భాషా పితామహుడు గిడుగు రామ్మూర్తి జయంతి సందర్భంగా ఈ ఉత్సవాలను నిర్వహిస్తున్నామని తెలిపారు.

బ్రిడ్జి నిర్మిస్తే ఎంతో ఉపయోగం

• నిర్మాణం కోసం ప్రజల ఎదురుచూపులు



అల్లూర్తి - నావూరు రహదారి మధ్యలో ఉన్న వాగు

పొదలకూరు: మండలంలోని అల్లూర్తి – నావూరు రహదారి మధ్యనున్న వాగుపై బ్రిడ్జి నిర్మాణం జరిగితే రాకపోకలు పెరగడంతోపాటు దూరం తగ్గుతుంది. గతంలో అంచనాలు పూర్తి చేసుకున్నా వివిధ కారణాలతో ఆచరణలో జాప్యం నెలకొంది. మండలంలోని అల్లూర్తి – నావూరు లింకురోడ్డును పంచాయతీరాజ్ శాఖ నుంచి ఆర్‌అండ్‌బీ శాఖలో విలీనం చేశారు. ఆర్‌అండ్‌బీ అధికారుల ద్వారా కూడా బ్రిడ్జి నిర్మాణం కోసం ప్రతిపాదనలు పంపారు. అయితే పనులు ముందుకు సాగలేదు. ఇటీవల వనంతోపు వద్ద ఏర్పాటు చేసిన మద్యం షాపు యజమానులు వ్యాపారం కోసం తాత్కాలికంగా పైపు కల్వర్టు నిర్మించారు. ఇక్కడ రోడ్డు సైతం సక్రమంగా లేకపోవడంతో రాత్రి వేళల్లో ప్రమాదాలు జరిగే అవకాశం ఉంది. అల్లూర్తి – నావూరు రోడ్డు మధ్యలో వాగుపై బ్రిడ్జి నిర్మాణం పూర్తి చేస్తే వర్షాకాలంలో సైతం గ్రామాల మధ్య రాకపోకలు పెరుగుతాయి. ఈ రోడ్డు మీదుగా పులికల్లు, మొగళ్లూరు, అంకుపల్లి, ఆర్‌వైపాళెం, వావింటపర్తి, ఊసపల్లి గ్రామాల నుంచి అల్లూర్తి మీదుగా నావూరు, నావూరుపల్లి, చెన్నారెడ్డిపల్లి గ్రామాలకు వెళ్లవచ్చు. ఇదే రహదారి మీదుగా నేదురుమల్లి, బత్తులపల్లి, సంగం వరకు పైగ్రామాల ప్రజలు వెళ్లేందుకు అవకాశం ఉంది. ఇందువల్ల 10 కి.మీ దూరం తగ్గుతుంది. అంతేకాక లింకు రోడ్డు మీదుగా ప్రయాణం చేస్తే గ్రామాల మధ్య రాకపోకలు పెరిగే అవకాశం ఉంది. వాగుపై బ్రిడ్జి నిర్మాణం చేపట్టకపోవడంతో కాస్త వర్షానికే పొంగి రాకపోకలు స్తంభించిపోతున్నాయి.

కాకాణిని కలిసిన సర్వేపల్లి నాయకులు



గోవర్ధన్‌రెడ్డితో పార్టీ నాయకులు



తాటిపర్తి పంచాయతీ నాయకులు



కాకాణితో వెంకటశేషయ్య తదితరులు

పొదలకూరు: మాజీ మంత్రి, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు కాకాణి గోవర్ధన్‌రెడ్డిని శుక్రవారం తాడేపల్లిలోని ఆయన నివాసంలో సర్వేపల్లి నియోజకవర్గం పొదలకూరు, ముత్తుకూరు మండలాల నాయకులు, కార్యకర్తలు కలిశారు. జిల్లా కేంద్ర కారాగారం నుంచి విడుదలైన కాకాణి తాడేపల్లిలోని నివాసానికి వెళ్లారు. నాయకులు అక్కడికి వెళ్లి కలిసి శాలువాలు కప్పి తమ అభిమానాన్ని చాటుకున్నారు. ఎన్ని కష్టాలు ఎదురైనా మీ వెంటే ఉంటామని పేర్కొన్నారు. కుట్రపూరితంగా కూటమి ప్రభుత్వం పెట్టిన కేసులు నిలబడవని తెలిపారు.

➡ గోవర్ధన్‌రెడ్డిని మండలంలోని తాటిపర్తి పంచాయతీ నాయకులు శుక్రవారం కలిశారు. ఈ సందర్భంగా ఆయనకు శాలువా కప్పి పుష్పగుచ్ఛం అందజేశారు. కార్యక్రమంలో పామూరు లచ్చారెడ్డి, నంది శ్రీనివాసులురెడ్డి, పామూరు వెంకటరమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

➡ **వెంకటాచలం:** గోవర్ధన్‌రెడ్డిని వెంకటాచలం మండలంలోని పలు గ్రామాల వైఎస్సార్‌సీపీ నాయకులు తాడేపల్లిలో శుక్రవారం కలిశారు. ఆ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు మందల వెంకటశేషయ్య, మందల మస్తానయ్య, గుర్రం పుట్టయ్య, ఉప్పు అశోక్, తాటిపర్తి సురేష్, దస్తగిరి, దూడల మనోజ్ తదితరులు కలిశారు.

మైపాడు బీచ్ అభివృద్ధికి కృషి



పూడికతీత పనులను ప్రారంభిస్తున్న కలెక్టర్, ఎమ్మెల్యే

ఇందుకూరుపేట: ప్రముఖ పర్యాటక కేంద్రం మైపాడు బీచ్ అభివృద్ధికి కృషి చేస్తానని కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి అన్నారు. మండలంలోని మైపాడులో బకింగ్‌హామ్ కెనాల్ పూడికతీత పనులను కలెక్టర్ ఆనంద్‌తో కలిసి శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కేరళ తరహాలో బీచ్‌ను టూరిజం సెంటర్‌గా అభివృద్ధి చేస్తామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

కొంటే తిప్పలే..

• అక్రమ లేఅవుట్లపై అప్రమత్తంగా ఉండాలంటున్న అధికారులు



సాలుచింతలు సెంటర్‌లో అనుమతుల్లేని లేఅవుట్

కోవూరు: అనుమతుల్లేని లేఅవుట్లలో స్థలాలు కొంటే తిప్పలు తప్పవని అధికారులు స్పష్టం చేస్తున్నారు. ప్రజలు జాగ్రత్తలు పాటించకుంటే భవిష్యత్తులో అనేక ఇబ్బందులు పడాల్సిన పరిస్థితి నెలకొంది. కాగా అనుమతుల్లేని లేఅవుట్లలో స్థలాలు కొన్నప్పటికీ భవిష్యత్తులో అక్కడ ఎలాంటి మౌలిక సదుపాయాలు చేపట్టేది లేదని అధికారులు ఇటీవల స్పష్టం చేశారు. దీంతో ఇప్పటికే అక్రమ లేఅవుట్లలో స్థలాలు కొన్నవారిపై పిడుగు పడినట్లు అయ్యింది. కోవూరు నియోజకవర్గంలో అనుమతులు లేనప్పటికీ కొందరు రియల్ దళారుల మాటలు విని స్థలాలు కొన్నవారు ఇప్పుడు ఏమి చేయాలో అర్థం కాని పరిస్థితి నెలకొంది.

నిబంధనలు ఇలా..

ఎవరైనా లేఅవుట్ వేయాలంటే వ్యవసాయభూమిని, వ్యవసాయేతర భూమిగా మార్చుకోవాలి. ఆపై గ్రామాల్లో అయితే పంచాయతీ, రెవెన్యూ శాఖల ద్వారా, పట్టణాల్లో అయితే మున్సిపాలిటీ ద్వారా అప్రూవల్స్ పొందాలి. నిర్దేశించిన లేఅవుట్ విస్తీర్ణంలో 12.5 శాతం (రిజర్వు ఏరియా, కమ్యూనిటీ కోసం) గ్రామాల్లో పంచాయతీలకు, పట్టణాల్లో మున్సిపాలిటీలకు సంబంధిత అధికారి పేరిట రిజిస్ట్రేషన్ చేయించి అప్పగించాలి. లేదా స్థలానికి సంబంధించి మార్కెట్ విలువలో 10 నుంచి 14 శాతం నగదును చెల్లించాలి. లేఅవుట్లో 35 నుంచి 40 అడుగుల రోడ్లు కచ్చితంగా ఉండాలి. నీటి సౌకర్యం, డ్రైయిన్లు, విద్యుత్ వంటి మౌలిక సదుపాయాలు ఉండాలి. ఆపై గ్రీనరీ లాంటివి కూడా ఏర్పాటు చేసుకోవచ్చు.

నియోజకవర్గంలో..

కోవూరు నియోజకవర్గంలో సుమారు 180 లేఅవుట్లు ఉన్నాయి. వీటిలో 80 శాతం ఇప్పటికే అమ్మకాలు సాగాయి. అయితే అనుమతుల్లేని లేఅవుట్లే అధిక శాతం ఉన్నట్లు తెలుస్తోంది. గతంలో విక్రయించిన కొన్ని లేఅవుట్లలో కరెంటు, నీటి సౌకర్యం వంటి మౌలిక వసతులు లేనివి ఉన్నాయి.

అప్రూవల్స్ లేకున్నా క్రయ, విక్రయాలు

ఓ భూమిని కొని కొంత బయానా చెల్లించి అగ్రిమెంట్‌తో చదును చేసి రాళ్లు నాటి స్కెచ్ వేసి సైట్ల అమ్మకాలు సాగించేస్తున్నారు కొందరు లేఅవుట్ యజమానులు. ఇలాంటి అక్రమ లేఅవుట్లను కొన్నవారు ఆపై ఇంటి నిర్మాణం చేసేందుకు పడరాని పాట్లు పడి మళ్లీ అధికంగా డబ్బులు ఖర్చు చేసి అనుమతులు పొందాల్సిన పరిస్థితి నెలకొంది. ఈ పరిస్థితిని గమనించిన గత ప్రభుత్వం లేఅవుట్ల విషయంలో పక్కాగా నిబంధనలు అమలు చేయాలని నిర్ణయించింది. ఆ మేరకు అనుమతులున్న లేఅవుట్లకు మాత్రమే క్రయ విక్రయాలు జరపాలంటూ ఆదేశాలు ఉండేవి. దీనిపై కొందరు కోర్టులకు వెళ్లడంతో రిజిస్ట్రేషన్లకు, అనుమతులకు సంబంధం లేదని కోర్టు చెప్పింది. దీంతో మళ్లీ అనుమతుల్లేని లేఅవుట్లలో సైట్ల రిజిస్ట్రేషన్లు సాగుతున్నాయి.